


నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ డే ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురం

డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీని నిర్వహించనున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నియంత్రణాధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమౌతుందన్నారు. ఈ ర్యాలీలో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారన్నారు. ఆ ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా తిరిగి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటుందన్నారు. ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సి వాలంటీర్లు, కళాశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొంటారని అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, ఎన్‌జిఒ హోం వరకు మానవహారం చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ ర్యాలీలో అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అకాల వర్షాలతో బెంబేలెత్తుతున్న రైతులు

పంటలను కాపాడుకొనేందుకు అన్నదాత అవస్థలు
ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరుగులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని అన్ని మండలాల్లోనూ చెదురుమదురుగా చినుకులు కురుస్తున్నాయి. దీంతో వరి కోతలు పూర్తి చేసుకుని పంటను ఇంటికి ఏ విధంగా సురక్షితంగా చేర్చుకోవాలో తెలియక రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే నూర్పులు పూర్తి చేసి ధాన్యాన్ని బస్తాలకెత్తిన రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు పరుగులు తీస్తున్నారు. రైతుల ఇబ్బందులు గమనించిన ప్రభుత్వ అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టారు. నిబంధనలకు కొన్ని మినహాయింపులు ఇచ్చారు. వాహనానికి జిపిఎస్ పరికరం కచ్చితంగా ఉండాలన్న ఇబ్బందులను సడలించారు. మిల్లులకు రోజువారి కేటాయింపులతో సంబంధం లేకుండా తరలించుకునేలా అనుమతులు ఇవ్వడంతో ధాన్యం తరలింపు ప్రక్రియ జోరందుకుంది. బ్యాంకు గ్యారంటీల సమర్పణలో మొండికేసిన మిల్లర్లను అధికారులు నయానో భయానో దారికి తీసుకొచ్చుకొని 93 మిల్లులకు గాను 60 మిల్లుల నుంచి రూ.20 కోట్ల విలువచేసే బ్యాంకు గ్యారంటీలను వసూలు చేశారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 2వేల మంది రైతుల నుంచి 13 వేల టన్నులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించినట్లుగా రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం వాతావరణంలో పూర్తిగా మార్పులు సంభవించి చినుకులు కురిశాయి. 15 మండలాల్లోనూ 51.6 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా జిల్లా సరాసరి 3.4 మిల్లీమీటర్లుగా నమోదయింది.



వర్షానికి తడవకుండా ధాన్యం బస్తాలపై టార్పాన్లు కప్పిన రైతులు

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తడిచిపోయిన ధాన్యాన్ని నిబంధనలను మినహాయించి కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శోభికకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలను కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ తేమ శాతం అధికంగా ఉందన్న నెపంతో తుఫాన్‌కు తడిచిన ధాన్యాన్ని సేకరణకు అడ్డు తగులుతున్నారని అన్నారు. కావున తేమ శాతాన్ని మినహాయించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని జెసి కోరారు. ఇందుకు జెసి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో...

వీరఘట్టం 3.6, సీతంపేట 4.4, భామిని 3.6 , పాలకొండ 3.6, కొమరాడ 2.2, గుమ్మలక్ష్మీపురం 2.6, కురుపాం, 4.2 జిఎం వలస , 2.0 గరుగుబిల్లి 1.4, పార్వతీపురం 6.8 మక్కువ 3.4, సీతానగరం 6.8, బలిజిపేట 1.8, సాలూరు 2.4 పాచిపెంట 2.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.



మక్కువలో వర్షానికి తడిచిపోయిన వరి పంట

వీరఘట్టం : తుపాను ప్రభావంతో మండలంలో కురుస్తున్న జల్లులకు పంటను కోసిన అన్నదాతలు ఎక్కడికక్కడే వరి కుప్పలు వేసుకున్నారు. చిన్నపాటి చినుకులు పడడంతో పంటను కాపాడుకునేందుకు కుప్పల పైన టార్పినులు కప్పి వేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి చంద్రన్నా!

ప్రజాశక్తి పార్వతీపురం

డిఎస్‌సి నుంచి తమ పోస్టులు మినహాయించి, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ముఖ్యమంత్రిని వేడుకొన్నారు. ఈ మేరకు స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట గల అడవి తల్లి విగ్రహం ఎదుట బిక్షాటన నిర్వహించారు. చంద్రన్న మమ్మల్ని ఆదుకోండి అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపాదిత డిఎస్‌సి నుంచి తమ పోస్టులు మినహాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ రాష్ట్ర అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపశమహరించుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమను కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు దీక్ష శిబిరం వద్ద గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా గురజాడ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, బిందు మాధవి, లక్ష్మి, మురళి, శ్రీను, కవిత, సీత, ఉమా, జ్యోతి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదవితల్లి విగ్రహం ఎదుట అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు భిక్షాటన



పార్వతీపురంలో బిక్షాటనం చేస్తున్న ఉద్యోగులు

అవుట్సోర్సింగ్ సిబ్బందికి న్యాయం చేయాలి

పార్వతీపురంరూరల్ : తమ న్యాయమైన హక్కులకై నిరసన దీక్ష చేస్తున్న గురుకుల పాఠశాలల్లో పని చేసే ఔట్సోర్సింగ్ సిబ్బందికి న్యాయం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గల 1636 మంది సిబ్బంది అరకొర వేతనాలతో గత 15 ఏళ్లుగా రెగ్యులర్ సిబ్బందితో పాటు గిరిజన విద్యార్థుల అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. వీరికి తగిన న్యాయం చేయకపోవడం వల్ల శాంతియుత నిరసన తెలియజేస్తున్నారని, ఔట్సోర్సింగ్ సిబ్బందితో ప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గురుకుల విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు అన్యాయం చేయడం సరికాదని వీరు హితవు పలికారు.



సీతంపేటలో కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మోకాళ్లపై నిలుచుని నిరసన

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ముఖద్వారం వద్ద అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మోకాళ్లపై నిల్చొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. దీంతో పాటు దీక్ష నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలకు స్థలాలు గుర్తించండి

ప్రజాశక్తి -పార్వతీపురం

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం కింద నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు స్థలాలను బుధవారం నాటికి గుర్తించి నివేదిక అందజేయాలని తహశీల్దార్లను, ఇఒపిఆర్‌డిలను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఆర్‌జిఎస్‌ఎ కార్యక్రమంపై జెసి, డిపిఒ, డిఎల్‌డిఒ, మండల తహశీల్దార్లు, ఇఒపిఆర్‌డిలతో శనివారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత కార్యక్రమమైన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద జిల్లాలో 80 గ్రామ పంచాయితీ భవన నిర్మాణాలు మంజూరయ్యాయని, కావున వెంటనే స్థలాలను గుర్తించాల్సి ఉందన్నారు. జెసి, జిల్లా పంచాయతీ అధికారి, డిఎల్‌డిఒ స్థల సేకరణపై ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ ఉండాలని స్పష్టం చేశారు. స్థల సేకరణ పూర్తయితే రూ.32 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి నమూనా ఉందని, ఆ విధంగా నిర్మాణాలు చేపడతామన్నారు. కావున గతంలో మీ పరిధిలో కోరిన పంచాయతీ భవన నిర్మాణాల కోసం అందరికీ అనుకూలమైన స్థలాన్ని త్వరగా గుర్తించి, వివరాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జెఎస్.ఎస్.శోభిక, డిపిఒ టి.కొండలరావు, డిఎల్‌డిఒ ఎన్.ఆర్.రామారావు, మండల తహశీల్దార్లు, ఇఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

గురజాడ ఆశయసాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మహాకవి గురజాడ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐద్వా నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో గురజాడ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో ఒకరని అలాగే గొప్ప హేతువాదని తెలిపారు. కన్యాశుల్కం వంటి నాటకాలు రచించిన అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ హెచ్ఎం, సిబ్బంది, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ఉన్నారు.



కొమరాడ : గురజాడకు నివాళ్లు అర్పిస్తున్న ఐద్వా నాయకులు, ఉపాధ్యాయులు

పార్వతీపురం టౌన్ : కార్మిక ఉద్యమ, పోరాటాలకు గురజాడ అప్పారావు చరిత్ర ఆదర్శంగా నిలుస్తుందని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా స్థానిక బెలగాం మెయిన్ రోడ్లో గల గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని కొనియాడారు. తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడని, అటువంటి మహా ఉద్యమ నేత స్ఫూర్తితో నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు పాకల సన్యాసిరావు, బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు, పి.రాజశేఖర్, బలరాం, మహిళలు పాల్గొన్నారు.



మండల మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కర్యాదర్శి రెడ్డి వేణు

గిరిజన చట్టాలను కాలరాసేందుకు కేంద్రం కుట్ర

ప్రజాశక్తి - సీతంపేట


గిరిజన చట్టాలు, హక్కులను కాలరాసేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. మండలంలోని ధారపాడు పంచాయతీ కోసంగిలో మండల మహాసభ శనివారం జరిగింది. ఈ మహాసభనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చినా, ఆ సంక్షేమ పథకాలేవీ సక్రమంగా అమలు చేయడంలేదని విమర్శించారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అనేక భారాలు వేసి సామాన్య మానవుడు నడ్డి విరుస్తుందన్నారు. ఇప్పటికే ట్రూ ఆఫ్ చార్జీలు పేరిట విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. నిరుద్యోగ సమస్య అధికంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై సిపిఎం ఎల్లవేళలా పోరాడుతుందనిన్నారు. అనంతరం 11మంది సభ్యులతో మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. మండల కార్యదర్శిగా ఆరిక భాస్కరరావు ఎన్నికవ్వగా సభ్యులుగా జీలకర్ర శ్రీరాములు, జీలకర్ర సుందరమ్మ, జీలకర్ర మధుసూదన్ రావు, మండంగి లక్ష్మణరావు, మండంగి కాంతారావు, పత్తిక వీరన్న, మండంగి వెంకటేష్, బిడ్డిక పరుశురాం, పాలక సాంబయ్య, ఆరిక ధనలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతి రావు, కె.గంగునాయుడు, నాయకులు దావాల రమణారావు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయరాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అవలంభించాలని విద్యార్థులను సూచించారు. అనంతరం స్థానిక ఎపి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. అందుబాటులో వసతి గృహాధికారి లేకపోవడంతో వాచ్‌మెన్ పైడిరాజుతో మాట్లాడి వెనుతిరిగారు.

వారిద్దరు చిన్నప్పటి నుంచి ప్రాణ స్నేహితులు ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి తిరిగారు... పెరిగారు. కాని విధి వారిపట్ల చిన్నచూపు చూసింది. స్నేహితుడి కారులో విశాఖపట్నం బయలుదేరారు. విదేశాల నుంచి వస్తున్న బంధువులను తీసుకొచ్చేందుకు వెళు తున్నానని తోటి స్నేహితుడికి చెప్పగా, తన భార్యకు బ్యాంకు ఉద్యోగానికి సంబంధించిన పరీక్ష విశాఖలో ఉందని మరొకరు చెప్పడంతో అంతా బయలుదేరి వెళ్లారు. ఇంతలో పోలిపల్లి వద్ద అనుకోని ప్రమాదంలో డ్రైవరుతో సహా నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన వడ్డే అభినవ్ (27), ఆయన భార్య మణిమాల (24), గవిడి కౌశిక్ (27), డ్రైవర్ మోడి జయేష్ (20) అక్కడికక్కడే మృతి చెందారు.



లారీని ఢీకొన్న కారు

ఘోరం

- ప్రాణం తీసిన అతివేగం
- టైరు పేలి పల్టీలు కొడుతూ లారీని ఢీకొన్న కారు
- నలుగురు దుర్మరణం
- మృతుల్లో దంపతులు
- అందులోనూ ఇద్దరు ప్రాణ స్నేహితులు



అభినవ్, మణిమాల దంపతులు (ఫైల్)



జయేష్



కౌశిక్

ప్రజాశక్తి-భోగాపురం

శ్రీకాకుళం పట్టణానికి చెందిన తూర్పుకాపు సంఘం నాయకులు లంకా బావాజినాయుడు కుమార్తె కుమారుడు వివాహం డిసెంబర్‌లో జరగనుంది. అందుకు అమెరికాలో ఉంటున్న బావాజినాయుడు కుమారుడు వస్తుండటంతో, వరుసకు మేల్లుడైన గవిడి కౌశిక్ విశాఖ విమానాశ్రయానికి బయలుదేరాడు. ఈ విషయాన్ని స్నేహితుడైన అభినవ్‌కు శుక్రవారం రాత్రి చెప్పాడు. తన భార్య మణిమాలకు విశాఖలో బ్యాంకు ఉద్యోగానికి సంబంధించిన పరీక్ష ఉందని అభినవ్ చెప్పడంతో కలిసి వెళ్దామని అనుకున్నారు. ముందురోజు అనుకున్నట్లే అంతా కలిసి కౌశిక్ కారులో బయలుదేరారు. ముందు సీట్లో కౌశిక్ కూర్చోగా, వెనుక సీట్లో అభినవ్ దంపతులు ఉన్నారు. అతివేగంగా వస్తున్న కారు పోలిపల్లి వద్దకు వచ్చేసరికి టైరు పేలిపోయింది. దీంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి అతి వేగంగా డివైడర్ పైనుంచి విశాఖ-శ్రీకాకుళం మార్గంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. దీంతో కారులో ఉన్న వారంతా అక్కడకక్కడే మృతి చెందారు. కారు నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ జయేష్ మృతదేహాన్ని అతి కష్టమ్మీద తీశారు. సమాచారం అందుకున్న సిఐ ప్రభాకర్, ఎస్ఐలు పాపారావు, సూర్యకుమారితోపాటు హైవే సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను బయటకు తీసి వాటిని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని విజయనగరం ఎస్‌పి పరిశీలించారు.

మూడు కుటుంబాల్లో విషాదఛాయలు

ఈ ప్రమాదంతో శ్రీకాకుళం పట్టణంలో మూడు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కౌశిక్ తండ్రి శ్రీకాకుళం పట్టణంలోని పేర్లవారి వీధిలో బంగారం దుకాణం నిర్వహిస్తుంటారు. ఇదే పట్టణానికి చెందిన ప్రముఖ నగల వ్యాపారి లంకా గాంధీ కుమార్తెతో ఏడాది క్రితమే ఆయనకు వివాహమైంది. తండ్రికి చేదోడువాదోడుగా కౌశిక్ ఉండేవాడు. వడ్డే అభినవ్ తండ్రి మన్మథరావుతో కలిసి పట్టణంలో లియో పేరుతో మెడికల్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కిందట మణిమాలతో వివాహం జరగగా, వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆ కుటుంబంలో తీరని శోకం మిగిలింది. ఆ బాలుడు అనాథ అయ్యాడు. డ్రైవర్ జయేష్ తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి సున్నపువారి వీధిలో టీ దుకాణం నడుపుతోంది. ఇప్పుడు కుమారుడు కూడా చనిపోవడంతో తనను అనాథని చేసి వెళ్లిపోయావంటూ ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

అతివేగంతో అటు నుంచి ఇటు..


టొయాటో కంపెనీకి చెందిన ఫార్చునర్ కారులో వీరంతా శ్రీకాకుళం నుంచి బయలుదేరి వస్తున్నారు. ఏం జరిగిందో తెలియదు కాని పోలిపల్లి వంతెన పైనుంచి దిగిన తరువాత ఒక్కసారిగా అతివేగంతో దూసుకొచ్చింది. ఇంతలో టైరు పేలిపోవడంతో కారు ఏకంగా డివైడర్ పైనుంచి అవతల వైపు అనగా శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలోకి ప్రవేశించింది. పల్టీలు కొడుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో ఉన్న సిసి కెమెరాల్లో ఈ దృశ్యాలు కనిపించాయి. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జయింది.

ఎమ్మెల్యేను కలిసిన డిఇఒ

గుమ్మలక్ష్మీపురం : జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతినాయుడు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని శనివారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు చిరు సత్కారం చేశారు. ఏజెన్సీలో విద్యావ్యవస్థ మెరుగుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏకలవ్య ప్రిన్సిపల్

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ వీర్‌సింగ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్వరిని సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఏం చేశారని జగనన్ను సన్మానించాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గత ప్రభుత్వంలో తీవ్రమైన ఆర్థిక దోపిడీకి పాల్పడి రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చిన మాజీ సిఎం జగన్ అమెరికా సంస్థలకు అడ్డంగా దొరికిపోయిన సన్మానం చేయమనడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర గిరిజనశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరులో తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి నాయకులతో నీటి సంఘం ఎన్నికలు గూర్చి శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతులకు మేలు చేసే నీటి సంఘం ఎన్నికలు నిర్వహించలేదని, 2014-19లో టిడిపి ప్రభుత్వం నీటి సంఘం ఎన్నికలు నిర్వహించి రైతులకు మేలు జరిగేలా కృషి చేసిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం సాగునీటి ప్రాజెక్టులకు షిల్ట్ క్లియరెన్స్ కూడా చేయలేదనీ, సాగునీటి ప్రాజెక్టులకు అంతర్జాతీయ సంస్థలు జైకా నిధులను మంజూరు చేసినా ఆ నిధులను కూడా ఎలా వాడుకోవాలో తెలియని దుస్థితిలో ఉందన్నారు. ఆ నిధులను నిర్వీర్యం చేసిందని, ఎంత సేపు అప్పులు చేసి ప్రజలకు డిబిటి ద్వారా సంక్షేమ పథకాలను అందించేవారమని చెప్పడం తప్ప రాష్ట్రంలో బూతద్దం పెట్టి చూసిన అభివృద్ధి అన్న పదం ఎక్కడా కనిపించలేదని ఎద్దేవా చేశారు. తన జల్సాల కోసం రూ.5850 కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. కార్యకర్తల ంతా సమిష్టిగా ఉండి గ్రామాల్లో సాగునీటిని సక్రమంగా వినియోగించుకొనేందుకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందని అన్నారు. రైతులకు మేలుచేసే ఈ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పనులు చేయాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజుదేవ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పట్టించుకో లేదని విమర్శించారు. ప్రస్తుతం జరగనున్న నీటి సంఘాలన్నీ ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నిం చాలని కోరారు. కార్యక్రమం లో సాలూరు పట్టణ, మక్కువ, మెంటాడ, పాచిపెంట మండలాలు టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, అముదాల పరమేశ్, గుల్ల వేణుగోపాలనాయుడు, చలుమూరి వెంకటరావు, పిన్నింటి ప్రసాద్ బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యవసాయాధికారులకు సూచనలు ఇస్తున్న జెసి శోభిక

ఉల్లిభద్ర పిపిసిని ఆకస్మిక తనిఖీ చేసిన జెసి

పార్వతీపురం : గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని (పీపీసీ) జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక శనివారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను ఆమె పరిశీలించి గ్రామ వ్యవసాయ సహాయకులకు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ధాన్యం కొనుగోళ్లలో చేపట్టాల్సిన అంశాలపై పలు సూచనలు, మార్గదర్శకాలను జారీచేశారు. గోదామును తనిఖీ చేసిన జెసి గరుగుబిల్లి మండలం సుంకిలోని బఫర్ గోడౌన్ (గోదాం)ను ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాములో ఉంచిన బస్తాలను రికార్డుల ప్రకారం ఉన్నదీ, లేనిదీ ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


చదువులో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని, మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. మండలంలోని పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చదువులు ఏ మేరకు పట్టు సాధించారనే దానిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు రాబట్టారు. పదో తరగతి విద్యార్థులు అప్పటి నుంచే కష్టపడి చదవాలన్నారు. విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, గిరిజన విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి ధ్యక్షులు పాడి.సుదర్శనరావు, ఎంపిడిఒ సాల్మన్ రాజ్, ట్రైకర్ బోర్డ్ రాష్ట్ర డైరెక్టర్ పువ్వల లావణ్య ఉన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

హక్కుల పరిరక్షణపై అవగాహన : డిఎస్‌పి

ప్రజాశక్తి - వీరఘట్టం

హక్కుల పరిరక్షణపై పాలకొండ డిఎస్‌పి రాంబాబు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం మండల కేంద్రంలోని రెల్లి వీధిలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మాదకద్రవ్యాలు, నాటు సారా విక్రయాలు వంటివి చేయకూడదని ప్రజలకు సూచించారు. వీటికి సంబంధించి అందుబాటులో సంకల్పం ఫిర్యాదులు పెట్టి ఏర్పాటు చేశామని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ జి కళాధర్, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు తెలియకుండా పనులెలా పెట్టారు?

మున్సిపల్ సమావేశంలో నిలదీత

ప్రజాశక్తి - సాలూరు

తమకు తెలియకుండానే 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు ఎలా అజెండాలో పెట్టారని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. శనివారం మున్సిపల్ వైస్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గిరి రఘు, గొర్లి వెంకటరమణ అభివృద్ధి పనులపై నిలదీశారు. దీనిపై డిఇ ప్రసాద్ మాట్లాడుతూ పనులను అత్యవసరంగా అజెండాలో పెట్టాలని ఉత్తర్వులు వచ్చాయని, చైర్‌పర్సన్ ఆమోదంతో పెట్టామని చెప్పారు. వైస్‌చైర్మన్ , కౌన్సిలర్ గిరి రఘు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల జీతాల బకాయి ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు,జి.నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఐదు నెలలకు పైగా ఉన్న వేతన బకాయిలు చెల్లించి తమను ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షులు జి.కల్యాణి ప్రభుత్వాన్ని కోరారు. అనేక కష్టనష్టాలకోర్చి పిల్లలకు రుచికరమైన భోజనం పెడుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు మానుకోవాలని వెంటనే బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా 5లోగా వేతనాలు ఇవ్వాలని, ఐదునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్రమైన కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతి ఏటా యూనిఫాం అందించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెరిగేదారులకు అనుగుణంగా వేతనాలు పెంచి ఆదుకోవాలని కోరారు. ప్రమాద నివారణ చర్యలకు రక్షణ సంబంధించిన పనిముట్లు అందించి ఆదుకోవాలని అన్నారు. చాలీచాలని వేతనాలతో పిల్లలకు అన్నం వండిపెట్టిన వంటమ్మలను ప్రభుత్వం ఆదుకోవాలని, వేతనాలు సక్రమంగా అందించకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - పాచిపెంట

మానవ జాతీయ హక్కుల దినోత్సవం సీతంపేట బాలుర పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడుతూ మన హక్కులు పరిరక్షించుకోవాలని అన్నారు మానవ జాతీయ హక్కుల దినోత్సవం గురించి వివరించారు. వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ పి.రంగలక్ష్మి, ఎఎస్ఐ సంజయ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గించిన పాలధరను పెంచాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విశాఖ డైయిరీ యాజమాన్యం ఆవు పాలు సేకరణ ధర లీటరుకు రూ.3 నుంచి రూ.4 వరకు తగ్గించిందని, ఈ చర్య వల్ల రైతులు నష్టపోతున్నారని, కావున తగ్గించని ధరలను పెంచాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని సంగంవలస విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా బంటు దాసు మాట్లాడుతూ తగ్గించిన ఆవు పాల ధర పునరుద్ధరించాలని, డెయిరీకి వచ్చే లాభాల నుంచి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెయిరీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. ఈ సమస్యలపై డిసెంబర్ 2న విశాఖ డైయిరీ కేంద్ర కార్యాలయం వద్ద జరుగు నిరసన కార్యక్రమంలో పెద్దఎత్తున పాల రైతులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంగంవలస రైతు సంఘం మండలం నాయకులు వెలమల సత్యనారాయణ, బడే వాసునాయుడు, బివి నాయుడు పాల్గొన్నారు.

సీతానగరం: పాడి రైతులకు తగ్గించిన పాల ధర పెంచాలని కోరుతూ డిసెంబర్ 2న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్టు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో కోరారు విశాఖ డెయిరీ యాజమాన్యం రైతులకు ఇచ్చిన పాల ధరను తగ్గించిందని యాజమాన్యం దుర్మార్గపు ఆలోచన తిప్పుకొట్టాలని పిలుపు నిచ్చారు.

రోడ్డుపై గుంతలను పూడ్చాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సీతానగరం నుంచి అడ్డాడ వరకు వెళ్లే రోడ్డు మధ్య మార్గంలో బుడ్డిపేట వద్ద పెద్ద గొంతులు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఈ గోతుల్లో పడి ఇద్దరు క్షతగాత్రులయ్యారన్నారు. రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెబుతున్నా, దీనిపై అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అధ్వాహనంగా ఉన్న సీతానగరం-అడ్డాడ రోడ్డు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి


ప్రజాశక్తి - సాలూరు


ప్రతి ఒక్క పేదవాని ముఖంలో ఆనందం చూడడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులు ఇలా ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించి వారికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని, అయినా కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తుందన్నారు. కిడ్నీ బాధితులు, ఆరోగ్యం సహకరించక పనులు చేయలేరని అటువంటి వారికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకునేందుకు రూ.10వేలు పింఛన్లు అందిస్తుంది మంత్రి వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శనరావు, ఎంపిడిఒ సాల్మన్ రాజ్, ట్రైకార్ బోర్డ్ స్టేట్ డైరెక్టర్ పువ్వల లావణ్య, నాయకులు తాడంగి కేశవరావు, రామారావు, కిల్లక శాంత కుమార్, తాడంగి దమయంతి, పాలక భాస్కరరావు, నిమ్మక జనార్ధన్, ఆరిక మంగులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: నియోజకవర్గం స్థాయిలో డిసెంబరు నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పట్టణంలో ప్రారంభించారు. అనారోగ్య కారణాలతో కిడ్నీ పాడై డయాసిస్ చేయించుకుంటున్న బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటిలో లబ్ధిదారులకు పెన్షన్లను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

సీతానగరం :మండలంలోని చినబోగిలి, జోగింపేట, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి కె.కరుణకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ సిబ్బంది అందజేస్తున్న పింఛన్ల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించి వారికి దగ్గరుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒకేరోజు మండలంలో పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో సిగ్నల్స్ ఇబ్బందులు ఉన్నప్పటికీ పింఛన్ల పంపిణీ లక్ష్యం దిశగా సిబ్బంది పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


పింఛను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

కురుపాం: మండల కేంద్రంలో టిడిపి, జనసేన మండల కన్వీనర్లు కెవి కొండయ్య, ఎన్. వంశీ ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమం సచివాలయ సిబ్బంది చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.వెంకటరావు, పల్లి సురేష్, వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో 92.41శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. మండలంలోని 9726 మందికి గానూ 8988 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

సీతంపేట: మండలంలో 97శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో 31 సచివాలయాలకు, 7960 పెన్షన్లకు 7740 పెన్షన్లను ఒక్క రోజులోనే పెన్షన్ దారులకు పంపిణీ చేశామని తెలిపారు. మిగతావి కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిమ్మలకు పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎఎంసి మాజీ చైర్మన్ నిమ్మల వెంకటరావు తండ్రి ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి శనివారం తన స్వగ్రామం ధర్మలక్ష్మీపురం వెళ్లి ఆయన్ను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మన్మధరావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైస్ ఎంపిపి అన్నాజీరావు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

సీతంపేట : మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ గియాజుద్దీన్ శనివారం సీతంపేట సచివాలయాన్ని సందర్శించి హౌస్‌హోల్డ్ ఎస్ పి సి ఎల్ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. మేము సైతం ఎనీమియా యాక్షన్ కమిటీ గ్రామస్థాయి నీరు పారిశుద్ధ్య కమిటీ పనితీరుపై చర్చించి సూచనలు ఇచ్చారు. నీటి నాణ్యత పరీక్షలు ప్రతివారం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి పిల్లలతో మాట్లాడి, భోజనాన్ని రుచి చూశారు. అంగన్వాడి సందర్శనలో దోనుబాయి పిహెచ్సి వైద్యాధికారి భానుప్రతాప్ పిల్లల ఆరోగ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సీతంపేట పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బలిజిపేట

కురుపాంలో డిసెంబర్ 10,11 తేదీల్లో జరగనున్న సిపిఎం 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు వై.మన్మధరావు, జి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మహాసభల పోస్టర్ శనివారం విడుదలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మహాసభలు సందర్భంగా డిసెంబర్ 10న ర్యాలీ, బహిరంగసభ జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రతినిధులతో మహాసభ ప్రారంభమవుతుందన్నారు. ఈ మహాసభలో గత నాలుగేళ్లలో చేపట్టిన ప్రజా పోరాటాలను సమీక్షించుకొని రాబోయే కాలంలో జిల్లా సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన కర్తవ్యాలను చర్చించనున్నట్టు తెలిపారు. కావున బహిరంగసభకు ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని, సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బద్దాన భానుమూర్తి, ఆవు సాంబమూర్తి ,పిసా వెంకటస్వామి, గంట్యాడ బలరామనాయుడు, పాల్గొన్నారు

కొమరాడ : డిసెంబర్ 10, 11 తేదీల్లో కురుపాంలో జరగనున్న సిపిఎం జిల్లా 10వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు వి.ఇందిర పిలుపు నిచ్చారు. ఈ మేరకు కొమరాడలో మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ అనేక ప్రజా సమస్యలపై ఇప్పటికే సిపిఎం పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. ఇంకా అపరిష్కృత సమస్యలు ఉన్నాయని, వీటిని పరిష్కరించుకొనేందుకు రానున్న రోజులు చేపట్టనున్న ఉద్యమాలకు ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. కావున ప్రజలంతా సహాయ సహకారాలు అందించాలని, పెద్ద ఎత్తున మహాసభలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘ నాయకులు రాము, కైలాస, మధు. వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంచాయతీలకు మంజూరు చేసే నిధులతో గ్రామాలను ప్రణాళికయుతంగా అభివద్ధి చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక మండలం పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పంచాయతీలకు రావాల్సిన నిధులను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని అడ్డుకుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కృషితో కేంద్ర ప్రభుత్వ నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలోనే వేస్తున్నారన్నారు. ఈ నిధులను ప్రణాళిక బద్ధంగా వినియోగించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. విద్యుత్ చార్జీలను తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే సూర్యఘర్ సోలార్ పవర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అందుకు ప్రజాప్రతినిధులు పథకంపై అవగాహన పెంచుకొని విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రమణమూర్తి 2024 -25 సంవత్సరానికి గానూ సవరించిన బడ్జెట్‌తో పాటు 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్ వివరాలను చదివి వినిపించి, సభ్యులచే ఆమోదింప చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రూపేష్, వైస్ ఎంపిపి సిద్ద జగన్నాధ రావు, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

కురుపాం : స్థానిక మండల పరిషత్ 2024-25 సంవత్సర సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌ను ఎంపిటిసి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్లో ఆదాయానికి గానూ పలు పథకాలు నిర్వహణ నిమిత్తం వ్యయం కేటాయిస్తూ సభ్యులు బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు నిషార్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, అధికారులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తోపుడుబండ్లు, చిల్లర వర్తకులు

తోపుడుబండ్ల, చిల్లర వర్తకులకు ఉపాధి కల్పించండి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్.

తోపుడుబండ్ల, చిల్లర వర్తకులు ఉపాధి కోల్పోయామని, తమను ఆదుకోవాలని ఆ సంఘం సంఘం కార్యదర్శి బంకురు సూరిబాబు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర, చిల్లర వర్తకుల సంఘం నాయకులు కోలా రాజు, నిమ్మకాయల సుందరరావు, రాజాన రాజు కోరారు. ఈ మేకు శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి, అక్కడ నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, కమిషనర్ శ్రీనివాసరాజుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్వతీపురం ప్రాంతంలో కంపెనీలు, ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధితో రోడ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్నారని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మున్సిపల్ అధికారులు, పోలీసులు తమ తోపుడు బండ్లను తొలగిస్తున్నారని, నాలుగు రోజుల నుంచి అమ్మడానికి అవకాశం లేక పచ్చి సరుకులు పాడై పోయాయని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేను కలిసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ఎవరికీ ఇబ్బంది కలగకుండా తమ ఉపాధికి అవకాశాలు కల్పించమని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంచాన ఉమా, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పడాల రాజశేఖర్, సిఐటియు జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి, బలరాం, వారణాసి శ్రీనివాసరావు, పాలకొండ వెంకన్న సొండి చిరంజీవి, రెల్లికుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు గౌరీశంకర్రావు, పాలకొండ ప్రభ,తదితరులు పాల్గొన్నారు..

యూనివర్సిటీని జిల్లాలోనే కొనసాగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన యూనివ ర్సిటీని తరలించకుండా జిల్లాలోనే నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం గుమ్మలక్ష్మీ పురంలో గోడపత్రిక లను విడుదల చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రస్తుతం పనులు కొనసాగుతున్న మెంటాడ మండలం కుంటివలస వద్దనే కొనసాగించి మన్యం జిల్లా అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చి కొత్తవలస వద్ద గిరిజన యూనివర్సిటీని కొనసాగిస్తామనడంలో అర్థం లేదని వెనక్కి తీసుకోకపోతే జిల్లా ప్రజలకు తీరని ద్రోహం చేసిన వారవుతారని తెలిపారు. రూ.110 కోట్లు నిధులు అవసరం కాగా, కేవలం నేటికీ రూ.432 కోట్లు మాత్రమే నిధులు కేటాయింపులు జరిగాయని, పనులు త్వరగా జరగపోవడానికి నిధులు కేటాయింపులు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో లేకపోవడం కూడా కారణమని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన నిర్ణయంపై వెంటనే పునరాలోచన చేయాలని, లేకుంటే అన్ని పక్షాలను కలుపుకొని పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మండంగి రమణ, నాయకులు అడ్డుమేశ్వరరావు, ఇండియా, గుణేశ్వరరావు ఉన్నారు.

నాణ్యతా లోపాల్లేకుండా పల్లె పండగ పనులు చేయాలి

కురుపాం : ఎక్కడా కూడా నాణ్యత లోపాలు లేకుండా పల్లె పండుగలో జరుగుతున్న సిసి రోడ్లు డ్రైన్లు చేయాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. శనివారం మండలంలో ఉదయపురం పంచాయతీ బొడ్డమానుగూడలో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రకారమే పనులన్నీ జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం మండలంలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని మొండెంఖల్, నీలకంఠపురం, లేవిడి, గుమ్మ తదితర పంచాయతీలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు సలహాలు అందించారు.

కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగు కౌన్సిల్ సమావేశానికి వద్ద కార్మికులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక నాయకులు మాట్లాడుతూ సాలూరు మున్సిపాలిటీలో పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, డ్రైవర్లకు రూ.24,500 చెల్లించాలని, విజయవాడ వరద బాధితుల సహాయార్థం విధులు నిర్వహించిన వారికి అదనపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ డిసెంబర్ 15లోగా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని, జీతాలను కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు, సాలూరు కమిటీ అధ్యక్షులు శంకర్ ,కోశాధికారి ఈశ్వరరావు మీడియా కన్వీనర్ రవి, వాటర్, ఎలక్ట్రికల్, పారిశుద్ధ్య విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా పారిశుధ్య కార్మికులు

వార్డు వాలంటీర్ల సమస్యల పరిష్కారానికి ధర్నా

పట్టణంలోని వార్డు వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని చేయాలని మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ వద్ద శనివారం వాలంటీర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి వార్డు వాలంటీర్ల యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఎన్వై నాయుడు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వార్డు వాలంటీర్లు పనిచేసిన కాలానికి వేతనాలిచ్చారని, స్థానిక మున్సిపాల్టీలో మాత్రం ఏప్రిల్, మే వేతన బకాయిలు నేటికీ ఉన్నాయని, వార్డు వాలంటీర్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. ఉద్యోగ భద్రత ఇచ్చి రూ.10వేల వేతనం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల నాటి హామీని అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్ల పట్ల కక్షలు మాని మానవతా దృక్పథంతో వ్యవస్థను కొనసాగించేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వాలంటీర్ల యూనియన్ నాయకులు డి.కేశవరావు, సిహెచ్ వెంకటరావు, బి.శంకర్రావు, ఎం.యోగేశ్వరి, ఎ.సుశీల, హేమలత, గౌరీశ్వరి, భారతి, ఎ.లత, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

ప్రజాశక్తి - సీతానగరం


సరైన జీవనశైలి, ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్ ఉంటుందని, విద్యార్థి దశ నుంచే ఇది అలవాటు చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయ, వైద్య సిబ్బందితో సమీక్షించి విద్యార్థులకు నిర్వహిస్తున్న హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై ఆరా తీశారు. రక్తహీనత, అనారోగ్య లక్షణాలు గుర్తించిన విద్యార్థుల జాబితా తరగతి వారీగా నమోదు చేసి ఇరు శాఖల సమన్వయంతో హీమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా అనారోగ్య లక్షణాలు గుర్తించిన విద్యార్థుల ఆరోగ్యం మెరుగు పడేందుకు చర్యలు చేపట్టి పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి రోగనిరోధకశక్తి ప్రామాణికమని, పోషకాహారం తీసుకోవడం ముఖ్యమని, అదేవిధంగా ప్రతి రోజూ క్రమబద్ధమైన దినచర్య, పరిశుభ్రత, సరైన జీవన శైలి పాటించడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. రక్తహీనత ఏ విధంగా గుర్తించాలి వాటి లక్షణాలు, చేతుల పరిశుభ్రత పద్ధతులు, వాటి ఆవశ్యకత, ఐరన్ శాతం కలిగి ఉండే ఆహార పదార్థాలు మొదలగు అంశాలపై ఫ్లిప్ చార్టులను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తాగునీటి పరీక్షలు ప్రతివారం చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఏ చిన్న అనారోగ్య సమస్య గుర్తించినా సత్వరమే స్పందించి చికిత్స అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.పావని, ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు, ప్రధానోపాధ్యాయులు ఐ.ప్రసన్నలక్ష్మి, సూపర్వైజర్లు సత్యవతి, జయగౌడ్, శర్మ, వైద్యసిబ్బంది సంధ్య, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని శంబర నడిమి వీధి అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామానికి చెందిన కొంతమంది రహదారుల అభివృద్ధికి ఆటంకాలు కలుగుతున్నాయని కలెక్టర్‌కు శుక్రవారం వినతిని అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ గ్రామాన్ని సందర్శించాలని స్థానిక తహశీల్దార్‌ను ఆదేశించారు. దీంతో శనివారం తహశీల్దార్ షేక్ ఇబ్రహీం నడిమివీధి ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డు పనులకు ప్రధాన ఆటంకంగా ఉన్న ఓ మహిళ ఇంటిని పరిశీలించారు. రహదారి పనులకు ఆటంకం కలగకూడదని ఆమెకు సూచించారు. ఆమెను కొంతమంది వెనుక నుంచి నడిపిస్తున్నారని గ్రామస్తులు తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అక్కడ పెద్ద ఘర్షణ చోటు చేసుకుంది. రహదారిని ఆనకునే వరకు కొంతమంది ఆక్రమణలను తొలగించాలని తహశీల్దార్ కోరారు. దీనికి స్పందించిన తహశీల్దార్ సోమవారం ఈ వ్యవహారాన్ని పరిష్కరిస్తామని అక్కడ ప్రజలకు తెలిపారు. ఇదిలా ఉండగా కొంతమంది తెరచాటుగా రాజకీయాలు నడుపుతూ రహదారి అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తూ సొంతంగా వారి లబ్ధి కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలోని రహదారుల వెడల్పుకు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు. సిరిమాను తిరిగే ప్రధాన రహదారి కావడంతో వెడల్పు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డెక్కిన శంబర గ్రామస్తులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహశీల్దార్